అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people

## నేరాల నియంత్రణకు నాకా బందీ

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

03



బుధవారం 27, మే 2026 | సంపుటి :03 | సంచిక :109 | పేజీలు :05 | వెల ₹5

# సమాయత్తం

## గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్ల కేటాయింపు

- లోటుపాట్లు లేని ఏర్పాట్లకు ఇప్పటి నుంచే ప్రణాళికలు
- దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు
- కాళేశ్వరంలో ఐదు జిల్లాల కలెక్టర్లతో ఉన్నత స్థాయి సమీక్ష

03



రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత ఘనంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సమాయత్తం అవుతోందని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. మంగళవారం సరస్వతి పుష్కరాల 6వ రోజు సందర్భంగా ఆయన కాళేశ్వరం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక మెగా విశ్రాంతి భవనంలో భూపాలపల్లి, ములుగు, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లతో కలిసి ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.. సరస్వతి ఆది, అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు కల్పించిన సౌకర్యాలను పీపీటీ ద్వారా కమిషనర్  కు వివరించారు.

– అక్షరదర్బార్, కాళేశ్వరం



## ప్రతి బూత్ ఏజెంట్ ఒక సైనికుడిలా పనిచేయాలి

- క్షేత్ర స్థాయిలో ఓటర్ల వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి
- 'ఎస్ఐఆర్' ప్రక్రియపై పార్టీ బూత్ స్థాయి నాయకత్వం దృష్టి సారించాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- నియోజకవర్గ స్థాయి బూత్ ఏజెంట్ల అవగాహన సదస్సు

02

అక్షరదర్బార్, హనుమకొండ: రాబోయే రోజుల్లో ప్రతి బూత్ ఏజెంట్ పార్టీకి ఒక సైనికుడిలా పనిచేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ లోని అంబేద్కర్ భవన్ లో మంగళవారం నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి బూత్ ఏజెంట్ల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కూడా పాల్గొన్నారు.



అక్షరదర్బార్, భీమదేవరపల్లి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'పీవీ విజ్ఞాన కేంద్రం' అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్   పాయ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం మాజీ ప్రధానమంత్రి, దివంగత పాములపర్తి వెంకట నరసింహారావు స్వగ్రామమైన వంగరలో నిర్మాణంలో ఉన్న విజ్ఞాన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.

### జూన్ 28 నాటికి పనులు పూర్తి కావాలి

ఈ సందర్భంగా పీవీ స్ఫూర్తి వనంలోని ఫోటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం, సమావేశ మందిరాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడ ఇంకా అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని పర్యాటక శాఖ, కుడా అధికారులకు సూచించారు. తాగునీటి పైపులైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశిస్తూ... రాబోయే జూన్ 28 నాటికి అన్ని రకాల పనులు పూర్తి చేసి, కేంద్రాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

## డెడ్ లైన్ జూన్ 28

- పీవీ విజ్ఞాన కేంద్రం పనులను వేగవంతం చేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- వంగరలో పీవీ విజ్ఞాన కేంద్రం, ఫోటో మ్యూజియం పరిశీలన
- పీవీ చిత్రపటాల ప్రాముఖ్యతను వివరించిన కుటుంబ సభ్యులు

04

## ఏసీబీకి చిక్కిన తహశీల్దార్



- రూ. 2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా బుక్
- డ్రైవర్ ద్వారా డబ్బులు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

03

# పుష్కర స్నానం ఆచరించిన దేవాదాయ శాఖ కమిషనర్

అక్షరదర్బార్, కాళేశ్వరం: సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా మంగళవారం పవిత్ర త్రివేణి సంగమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు కమిషనర్ కు పూర్ణ కుంభ స్వాగతం పలికి శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారికి అభిషేకం, పార్వతి దేవి ఆలయంలో అర్చనల అనంతరం అర్చక స్వాములు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పుష్కరాల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, రోజు రోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా స్వామి దర్శనం సత్వరం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తున్న దృష్ట్యా పరిశుభ్రత, భద్రత, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏడీసీ ఎం కృష్ణవేణి, ఆర్ జేసీ రామకృష్ణారావు, డిప్యూటీ కమిషనర్ ఆర్ సునీత, ఆలయ ఈవో ఎస్ మహేష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.








# కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు మారాలి

- వృత్తి నైపుణ్యంపై ప్రత్యేక శిక్షణ అవసరం.. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి
- యూనియన్‌పై సభ్యులకు నమ్మకం కలిగించాలి
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

అక్షరదర్బార్, హైదరాబాద్: మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వృత్తి నైపుణ్యాన్ని మరింత మెరుగు పరచుకోవాలని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ మీడియా అకాడమీ భవనంలో హనుమకొండ జిల్లా నూతన టీయూడబ్ల్యూజే కమిటీ ప్రతినిధులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, కార్యదర్శి ఊటుకూరు సాయిరాం, కోశాధికారి విష్ణువర్ధన్‌లు మీడియా అకాడమీ చైర్మన్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందించిన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లా కమిటీ ప్రతిపాదన మేరకు జిల్లాలో ఏఐ వినియోగంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో జర్నలిస్టులకు రెండు రోజులపాటు ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో ఆసక్తి గల జర్నలిస్టులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా యూనియన్ కృషి చేయాలని సూచించారు. అనంతరం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీని జిల్లా నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా నాయకులను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. యూనియన్‌పై ప్రతి సభ్యుడికి నమ్మకం కలిగే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. క్రమశిక్షణతో పని చేస్తూ సంఘం పటిష్టతకు కృషి చేయాలని అన్నారు. జిల్లాలో నిర్వహించనున్న సెమినార్లు, అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలను హనుమకొండ జిల్లా యూనిట్‌తో పాటు గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా సంఘం కృషి చేస్తుందని, సమస్యలు ఉంటే రాష్ట్ర నాయకత్వానికి నివేదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బోల్లారపు సదయ్య, కోశాధికారి అమర్, రాష్ట్ర నాయకులు గాడిపెల్లి మధు, కంకణాల సంతోష్ పాల్గొన్నారు.

# ప్రతి బూత్ ఏజెంట్ ఒక సైనికుడిలా పనిచేయాలి

- క్షేత్ర స్థాయిలో ఓటర్ల వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి
- 'ఎస్ఐఆర్' ప్రక్రియపై పార్టీ బూత్ స్థాయి నాయకత్వం దృష్టి సారించాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- నియోజకవర్గ స్థాయి బూత్ ఏజెంట్ల అవగాహన సదస్సు



అక్షరదర్బార్, హనుమకొండ: రాబోయే రోజుల్లో ప్రతి బూత్ ఏజెంట్ పార్టీకి ఒక సైనికుడిలా పనిచేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ లోని అంబేద్కర్ భవన్ లో మంగళవారం నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి బూత్ ఏజెంట్ల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

– పట్టణ వాతావరణంలో 'ఎస్ఐఆర్' ప్రక్రియ ఒక సవాల్

ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు, ఓటర్ల వివరాలు, ప్రభుత్వ పథకాలపై ఏజెంట్లకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. ముఖ్యంగా ఎస్ఐఆర్ (స్పెషల్ ఇన్ టెన్సివ్ రివిషన్) ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. "వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పూర్తి స్థాయి పట్టణ వాతావరణంలో ఉండటంతో ఓటర్లను గుర్తించడం, వారి వివరాలను నిరంతరం అప్‌డేట్ చేయడం క్లిష్టమైన ప్రక్రియ. ప్రజలు తరచూ ఇళ్లు మారడం, ఉద్యోగాల రీత్యా చిరునామాలు మార్చడం వల్ల ఓటరు జాబితాలో ఖచ్చితత్వం నిలుపుకోవడం సవాల్‌గా మారుతుంది. అలాంటి పరిస్థితుల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంతగానో దోహదపడుతుంది" అని ఆయన పేర్కొన్నారు.

**నిర్లక్ష్యం వహిస్తే భారీ నష్టం**

గతంలో 2002లో జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియ మళ్లీ ఇప్పుడు 2026లో నిర్వహించబడుతున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, బూత్ ఏజెంట్లు దీనిని అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రతి ఓటరును మ్యాపింగ్ చేసుకోవడం, కుటుంబాల వారీగా వివరాలు నమోదు చేయడం, కొత్త ఓటర్ల గుర్తింపు, మారిన ఓటర్ల వివరాల సవరణపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం చేస్తే అర్హులైన ఓటర్లు జాబితా నుంచి తప్పిపోవడం, డూప్లికేట్ నమోదులు పెరగడం వంటి సమస్యలు వస్తాయని, బూత్ స్థాయిలో జరిగే చిన్న పొరపాటు కూడా ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు.

**నేటి నుంచే డివిజన్ స్థాయి సమావేశాలు**

ఇప్పటికే నియోజకవర్గంలో డివిజన్ ల వారీగా ఇంచార్జిలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. బుధవారం నుంచి ఇంచార్జ్ లు తమ పరిధిలోని డివిజన్ లలో బూత్ స్థాయి కన్వీనర్స్, ఏజెంట్స్, ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడి ఓటర్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని పిలుపునిచ్చారు.

**బూత్ లెవెల్ ఏజెంట్ 'హ్యాండ్ బుక్' ఆవిష్కరణ**

అనంతరం, బూత్ ఏజెంట్ల మార్గదర్శకత్వం కోసం వరంగల్ ఎంపీ కడియం కావ్య రూపొందించిన "బూత్ లెవెల్ ఏజెంట్ సంక్షిప్త సమాచార హ్యాండ్ బుక్" ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు.

# అక్రమ నిర్మాణాల తొలగింపు

అక్షరదర్బార్, వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ ఆదేశాల మేరకు వరంగల్ పోస్టాఫీస్ సమీపంలోని మున్సిపల్ భూమి, ప్రధాన రహదారిపై ఉన్న ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు మంగళవారం తొలగించారు. వరంగల్ పోస్టాఫీస్ పక్కన ఉన్న మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు, ప్రధాన రహదారికి ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న దుకాణాలు, ఇతర ఆక్రమణలను కూడా అధికారులు తొలగించారు. గత కొన్ని నెలలుగా ఈ ఆక్రమణల కారణంగా వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు సిటీ ప్లానర్ రవీందర్ తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ శాఖ, డిఆర్ఎఫ్ సిబ్బంది సహకారంతో ఈ చర్యలు చేపట్టారు. ఆక్రమణల తొలగింపు అనంతరం ఖాళీ అయిన మున్సిపల్ స్థలాన్ని పార్కింగ్ అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఆ స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



# సమాయత్తం

- గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్ల కేటాయింపు
- లోటుపాట్లు లేని ఏర్పాట్లకు ఇప్పటి నుంచే ప్రణాళికలు
- దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు
- కాళేశ్వరంలో ఐదు జిల్లాల కలెక్టర్లతో ఉన్నత స్థాయి సమీక్ష



అక్షరదర్బార్, కాళేశ్వరం : రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత ఘనంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సమాయత్తం అవుతోందని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. మంగళవారం సరస్వతి పుష్కరాల 6వ రోజు సందర్భంగా ఆయన కాళేశ్వరం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక మెగా విశ్రాంతి భవనంలో భూపాలపల్లి, ములుగు, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లతో కలిసి ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.. సరస్వతి ఆది, అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు కల్పించిన సౌకర్యాలను పీపీటీ ద్వారా కమిషనర్‌కు వివరించారు.

### ముందస్తు చర్యలతోనే విజయవంతం..

ఈ సందర్భంగా దేవాదాయ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ.. రాబోయే గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం సుమారు రూ.1000 కోట్ల నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సరస్వతి పుష్కరాల్లో ఎదురైన చిన్నచిన్న లోటుపాట్లను గుర్తించి, వాటిని గోదావరి పుష్కరాల్లో పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందుకోసం గోదావరి పరివాహక ప్రాంత జిల్లాల కలెక్టర్లతో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇప్పటికే ఒక ప్రత్యేక సమావేశాన్ని కూడా నిర్వహించారని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పారిశుధ్యం, సురక్షిత త్రాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, పార్కింగ్ వసతులు, వీఐపీ, వీవీఐపీల పర్యటనల ఏర్పాట్లు మొదలైన అంశాలపై జిల్లాల వారీగా ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు (యాక్షన్ ప్లాన్) రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

### ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వన్‌వే విధానం

భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. గత సంవత్సరం నిర్వహించిన సరస్వతి ఆది పుష్కరాల సందర్భంగా పుష్కర ఘాట్ల నిర్మాణం, సరస్వతి విగ్రహం ఏర్పాటుతో పాటు భక్తుల సౌకర్యార్థం టెంట్ సిటీ, వ్యాపార స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పార్కింగ్ స్థలాల నుండి సరస్వతి ఘాట్ వరకు ఉచిత షటిల్ బస్సులను నడిపామన్నారు. "గత ఆది పుష్కరాల రెండో రోజున భక్తులు పెద్ద ఎత్తున రావడంతో కొంత ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈసారి సరస్వతి అంత్య పుష్కరాల్లో వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని అమలు చేయడంతో పాటు అదనపు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశాం. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్లే పుష్కరాలను విజయవంతంగా నిర్వహించగలుగుతున్నాం." అన్నారు. ఈ సమావేశంలో ములుగు, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు బొర్కడే హేమంత్ సహదేవరావు, కుమార్ దీపక్, సత్య ప్రసాద్‌లతో పాటు నిజామాబాద్, నిర్మల్ జిల్లాల అదనపు కలెక్టర్లు బుజంగరావు, వెంకటేశ్వర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , కాటారం ఆర్‌డీఓ రవీందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## 'సిటీ న్యూరో సెంటర్' ప్రస్థానం అభినందనీయం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

అక్షరదర్బార్, వరంగల్: రోగుల సేవలో దశాబ్ద కాలం పూర్తి చేసుకున్న సిటీ న్యూరో సెంటర్ వైద్య సేవలలో తన విశిష్ట ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. ఈ పదేళ్ల మైలురాయిని పురస్కరించుకుని ఆసుపత్రి యాజమాన్యం "A Decade of Excellence in Neurosciences & Heart" పేరుతో రూపొందించిన ప్రత్యేక బ్రోచర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ ఆవిష్కరణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సిటీ న్యూరో ఆస్పత్రి గత పదేళ్లుగా వైద్య రంగంలో అందిస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సిటీ న్యూరో సెంటర్ తన మూడు బ్రాంచ్‌ల ద్వారా ఇప్పటివరకు సుమారు 7 లక్షల మంది రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం విశేషమన్నారు. అలాగే 18 వేలకు పైగా క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి రోగుల గుండెల్లో నమ్మకాన్ని నింపిందని, ఇది ఆసుపత్రి సాధించిన గొప్ప విజయమని ఆయన అభినందించారు.
ఒకవైపు అత్యంత క్లిష్టమైన, అత్యాధునిక శస్త్రచికిత్సలు నిర్వహిస్తూనే.. మరోవైపు పేద, మధ్యతరగతి ప్రజలకు సైతం అందుబాటు ధరల్లో వైద్య సేవలు అందించడం సిటీ న్యూరో సెంటర్ యొక్క సామాజిక బాధ్యతకు నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. న్యూరోసైన్సెస్, హార్ట్ కేర్ రంగాల్లో ఈ సంస్థ అందిస్తున్న సేవలు భవిష్యత్తులో మరింత విస్తరించాలని, మరిన్ని మైలురాళ్ళను అధిగమించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనస్థీషియా హెడ్ డాక్టర్ కృష్ణారెడ్డి, జనరల్ మేనేజర్ పి రాము, ఆస్పత్రి సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు నాకా బందీ

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: నేరాల నియంత్రణతో పాటు పాత నేరస్తులను గుర్తించేందుకు నాకా బందీ తనిఖీలు నిర్వహిస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు చేపట్టిన నాకాబందీ తనిఖీల్లో పోలీసులు మొత్తం 11,286 వాహనాలు తనిఖీ చేయబడ్డాయని, ఇందులో సెంట్రల్ జోన్ పరిధిలో 5626 వాహనాలు, ఈస్ట్‌జోన్ పరిధిలో 2591, వెస్ట్ జోన్ పరిధిలో 2057, ట్రాఫిక్ పరిధిలో 992 వాహనాలను తనిఖీ చేయగా వివిధ కారణాలతో 275 వాహనాలు సీజ్ చేయబడ్డాయని, దీంతో పాటు ఈ తనిఖీల్లో 197 మంది వాహనదారులు మద్యం సేవించి వాహనం నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడటం జరిగిందని తెలిపారు. వీటితో పాటు శాయంపేట పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై రెండు కేసులు, దామెర పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం తరలిస్తున్న వారిపై రెండు కేసులు నమోదు కాగా, ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక అనుమానిత వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు.



## ఏసీబీకి చిక్కిన తహశీల్దార్

- -రూ. 2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా బుక్
- -డ్రైవర్ ద్వారా డబ్బులు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

అక్షరదర్బార్, శామీర్‌పేట: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండల తహశీల్దార్ సుచరిత లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు అడ్డంగా బుక్కయ్యారు. ఒక బాధితుడి నుంచి రూ. 2 లక్షల లంచం డిమాండ్ చేసి, ఆ డబ్బును తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆమెను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితుడికి సంబంధించిన ఒక భూమి వ్యవహారంలో అనుకూలంగా నిర్ణయం తీసుకోవడానికి తహశీల్దార్ సుచరిత రూ.2 లక్షల లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఈ విషయమై ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అధికారుల వ్యూహం ప్రకారం.. బాధితుడు మంగళవారం ఎమ్మార్వో కార్యాలయానికి చేరుకున్నారు.



### డ్రైవర్ ద్వారా వసూలు..

నేరుగా డబ్బులు తీసుకుంటే దొరికిపోతామనే భయంతోనో ఏమో కానీ, తహశీల్దార్ సుచరిత ఆ లంచం డబ్బును తన వ్యక్తిగత డ్రైవర్‌కు ఇవ్వాల్సిందిగా బాధితుడికి సూచించారు. తహశీల్దార్ ఆదేశాల మేరకు డ్రైవర్ బాధితుడి నుంచి రూ.2 లక్షల నగదును తీసుకున్నాడు. అనంతరం ఆ డబ్బును డ్రైవర్ తీసుకెళ్లి తహశీల్దార్ సుచరితకు అందిస్తుండగా, అక్కడే నిఘా ఉంచిన ఏసీబీ అధికారులు ఇద్దరినీ రంగులద్దిన నోట్లతో సహా (రెడ్ హ్యాండెడ్‌గా) పట్టుకున్నారు.

### కార్యాలయంలో సోదాలు..

తహశీల్దార్ సుచరితతో పాటు ఆమె డ్రైవర్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని, కార్యాలయంలోని పలు కీలక పత్రాలను పరిశీలించారు. సుచరితకు సంబంధించిన నివాసాలు, ఇతర ప్రాంతాలలో కూడా ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. "ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగితే అస్సలు ఉపేక్షించవద్దు. లంచం అడగడం, ఇవ్వడం రెండూ నేరమే. మీ వద్ద ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు కాల్ చేసి ఫిర్యాదు చేయండి" అని ఏసీబీ అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు


# తీపి కబురు

- పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా మొదటి తారీఖునే వేతనాలు చెల్లింపు
- ఇందుకోసం నెలనెలా ప్రభుత్వం నుంచి రూ.50 కోట్లు మంజూరు
- ఇకనుంచి జీపీ సొంత ఆదాయం బ్యాంకు ఖాతాలో జమ
- పెన్షన్ పంపిణీ విధానంలోనూ మార్పు. నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్రంలోని 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా మొదటి తారీఖునే జీతాలు చెల్లించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు నెలనెలా సమయానికి జీతాలు అందినట్లే గ్రామ పంచాయతీ సిబ్బందికి కూడా వేతనాలు అందాలని స్పష్టం చేశారు. మంగళవారం ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాలు చెల్లించడానికి ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.50 కోట్లు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు అనే తేడా లేకుండా ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని ఉద్యోగులకు మొదటి తారీఖునే జీతాలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. సిబ్బంది జీతాలు ఒక్కరోజు ఆలస్యమైనా సహించబోమన్నారు. స్వంత ఆదాయంపై గ్రామ పంచాయతీల స్వతంత్రతను నిర్వీర్యం చేస్తూ గత ప్రభుత్వం తొలగించిన నిబంధనను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018 లోని సెక్షన్ 70 (3) ప్రతిపాదిత సవరణ ప్రకారం గ్రామ పంచాయతీ స్వంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో కాకుండా బ్యాంకు ఖాతాలో జమ చేసే విధంగా సవరణ చేయాలని అధికారులను ఆదేశించారు.

**పెన్షన్ పంపిణీ విధానం మార్పు**

పెన్షన్ల పంపిణీ విధానంపై ముఖ్యమంత్రి అధికారులకు కీలక ఆదేశాలిచ్చారు. పోస్టల్ శాఖ ద్వారా అందజేస్తున్న ప్రస్తుత పెన్షన్ పంపిణీ విధానాన్ని మార్చి నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. పెన్షన్లు అర్హులకు మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్, ఎస్ఈఈఈపీసీ సర్వే డేటా ఆధారంగా పెన్షన్లను క్రమబద్ధీకరించాలని చెప్పారు. కొత్త పెన్షన్ల మంజూరు విషయంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# డెడ్ లైన్ జూన్ 28

- పీవీ విజ్ఞాన కేంద్రం పనులను వేగవంతం చేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- వంగరలో పీవీ విజ్ఞాన కేంద్రం, ఫోటో మ్యూజియం పరిశీలన
- పీవీ చిత్రపటాల ప్రాముఖ్యతను వివరించిన కుటుంబ సభ్యులు



అక్షరదర్బార్, భీమదేవరపల్లి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'పీవీ విజ్ఞాన కేంద్రం' అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం మాజీ ప్రధానమంత్రి, దివంగత పాములపర్తి వెంకట నరసింహారావు స్వగ్రామమైన వంగరలో నిర్మాణంలో ఉన్న విజ్ఞాన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.

**జూన్ 28 నాటికి పనులు పూర్తి కావాలి**

ఈ సందర్భంగా పీవీ స్ఫూర్తి వనంలోని ఫోటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం, సమావేశ మందిరాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడ ఇంకా అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని పర్యాటక శాఖ, కుడా అధికారులకు సూచించారు. తాగునీటి పైపులైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశిస్తూ... రాబోయే జూన్ 28 నాటికి అన్ని రకాల పనులు పూర్తి చేసి, కేంద్రాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

**అలరించిన అరుదైన చిత్రాలు.. పుస్తకాలు**

అనంతరం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్వగృహంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఫోటో మ్యూజియాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. పీవీ నరసింహారావు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా పనిచేసిన కాలంలో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో దిగిన అరుదైన ఫోటోలను ఆమె ఆసక్తిగా తిలకించారు. వివిధ సందర్భాల్లో దిగిన ఆయా ఫోటోల ప్రాముఖ్యతను, వాటి వెనుక ఉన్న విశేషాలను పీవీ కుటుంబ సభ్యులైన పీవీ ప్రభాకర్ రావు, ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, పీవీ మదన్ మోహన్ కలెక్టర్‌కు వివరించారు. వివిధ దేశాల నుంచి పీవీ నరసింహారావుకు లభించిన ప్రతిష్టాత్మక పురస్కారాలను, ఆయన స్వయంగా రచించిన పలు పుస్తకాలను కలెక్టర్ పరిశీలించారు. అంతకుముందు వంగర గ్రామానికి చేరుకున్న కలెక్టర్, అక్కడ ఉన్న పీవీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ పర్యటనలో జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ రాజేష్, పర్యాటక శాఖ డీఈ ధనరాజ్, ఏఈ కీర్తి, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మల్లంపల్లి గ్రామాభివృద్ధే నా ప్రధాన కర్తవ్యం

**ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేసిన సర్పంచ్ బూర రాధికా హేమచంద్ర గౌడ్**



అక్షర దర్బార్, దుగ్గొండి (మే 26): మల్లంపల్లి గ్రామ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన కర్తవ్యమని మల్లంపల్లి గ్రామ సర్పంచ్ బూర రాధికా హేమచంద్ర గౌడ్ అన్నారు. మంగళవారం గ్రామంలోని మొండికుంట చెరువు వద్ద జరుగుతున్న ప్రభుత్వ ఉపాధి హామీ పనులను పంచాయతీ సెక్రటరీ దేవేందర్‌తో కలిసి ఆమె పరిశీలించారు. వేసవి తీవ్రత దృష్ట్యా కూలీల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత పేదలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈజీఎస్ పథకాన్ని అర్హులైన కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో ఉపాధి హామీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పనుల్లో పాల్గొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

అక్షర దర్బార్, చిట్యాల (మే 26): గత కొంతకాలంగా క్యాన్సర్ బారినపడి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గంగాధరి రాజును చిట్యాల మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మంగళవారం పరామర్శించారు. వైద్య పరంగా గతంలో అనేకమందికి సహాయం చేసిన గంగాధరి రాజు అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న గండ్ర వెంకటరమణారెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆయనను ఓదార్చారు. అనంతరం రాజు ఆరోగ్య పరిస్థితిపై అక్కడ చికిత్స అందిస్తున్న వైద్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గంగాధరి రాజుకు ఎలాంటి లోటు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించి త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులను మాజీ ఎమ్మెల్యే కోరారు.



### శతాధిక మాజీ వార్డు సభ్యురాలు

## కొమురమ్మ కన్నుమూత

అక్షర దర్బార్, చిట్యాల (మే 26): చిట్యాల మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యురాలు, శత వసంతాలు దాటిన వృద్ధురాలు నాగిరెడ్డి కొమురమ్మ (110) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. గ్రామంలోనే అత్యంత పెద్ద వయస్కురాలైన కొమురమ్మ చనిపోయేంతవరకు ఆరోగ్యంగానే ఉన్నారని, అయితే గత మూడు రోజులుగా మండుతున్న ఎండల తీవ్రతను తట్టుకోలేక అనారోగ్యానికి గురై తుది శ్వాస విడిచిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ఒక కుమార్తె ఉన్నారు. కొమురమ్మ 1986 నుండి 1995 వరకు గ్రామ పంచాయతీ పాలకవర్గంలో వార్డు సభ్యురాలుగా ప్రజలకు సేవలందించారు. ఆమె మృతి వార్త తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మృతదేహాన్ని సందర్శించి కన్నీటి నివాళులు అర్పించారు.





## 108 పైలట్లు రోగుల పాలిట ప్రాణదాతలు

### అంతర్జాతీయ పైలట్ల దినోత్సవంలో డీఎంఓ డాక్టర్ గోపాల్ రావు

అక్షర దర్బార్, ములుగు (మే 26): ములుగు జిల్లాలో ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా వెనకడుగు వేయకుండా రోగుల ప్రాణాలను కాపాడే నిజమైన ప్రాణదాతలు 108 అంబులెన్స్ పైలట్లు అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంఓ) డాక్టర్ గోపాల్ రావు కొనియాడారు. మంగళవారం అంతర్జాతీయ 108 పైలట్ల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా గోపాల్ రావు మాట్లాడుతూ.. ప్రమాదాలు, ప్రసవ వేదన, అత్యవసర అనారోగ్య స్థితిలో ఉన్న రోగులను కంటికి రెప్పలా కాపాడుతూ, సకాలంలో ఆసుపత్రికి తరలించి ఎన్నో ప్రాణాలను నిలబెడుతున్న పైలట్ల సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎంఈ రాజ్ కుమార్, ఈఎంటీలు, 108 పైలట్లు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు పులిహోర, మజ్జిగ పంపిణీ

అక్షర దర్బార్, శాయంపేట (మే 26): శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామంలోని వవిల కుంట వద్ద గ్రామీణ ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బోనేపెల్లి రఘుపతి రెడ్డి పులిహోర ప్యాకెట్లను, ఉప సర్పంచ్ దాసరి లక్ష్మారెడ్డి చల్లని మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మండుటెండల్లో పనిచేస్తున్న పేద కూలీల దాహార్తిని, ఆకలిని తీర్చేందుకు తమ వంతు సాయంగా వీటిని అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ఎలమంచి జైపాల్ రెడ్డి, మోరే రాజయ్య, మూలగుండ్ల సందీప్ రెడ్డి, కుసం బుచ్చయ్య, గద్రకోట గట్టుమళ్ళు పాల్గొన్నారు.



## నడికూడ లో వడగండ్ల వాన

○ ఇళ్లు, మిర్చి పంటలు నష్టం

అక్షర దర్బార్, పరకాల (మే 26): నడికూడ మండలంలో మంగళవారం కురిసిన అకాల వడగండ్ల వర్షం తీవ్ర ఆస్తినష్టాన్ని మిగిల్చింది. బలమైన ఈదురుగాలులు, భారీ వర్షం కారణంగా విద్యుత్ స్తంభాలు దెబ్బతిని సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చర్లపల్లి గ్రామానికి చెందిన దూడే రాజయ్య ఇంటి పైకప్పు రేకులు ఈదురుగాలులకు ఎగిరిపోవడంతో ఇంట్లో నిల్వ ఉంచిన మిర్చి పంట వర్షానికి పూర్తిగా తడిసి పాడైపోయింది. అలాగే అదే గ్రామానికి చెందిన సల్మాన్ ఖాన్ నిర్మిస్తున్న నూతన హోటల్ భవనం ముందు భాగంలోని రేకులు, గోడలు గాలులకు కూలిపోయాయి. అకాల వర్షంతో సర్వస్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వం సర్వే చేసి, తక్షణ ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# చిట్యాలలో గాలివాన బీభత్సం

○ కూలిన శతాబ్దపు వేపచెట్టు, విద్యుత్ స్తంభాలు.. దెబ్బతిన్న ఇళ్లు, కారు

అక్షర దర్బార్, చిట్యాల (మే 26): చిట్యాల మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. ఒకవైపు ఎండ కొడుతుండగానే ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో గాలివాన దూసుకువచ్చింది. వెంకట్రావుపల్లి, తిరుమలాపురం, వెలేటి రామయ్యపల్లి, క్రోసూరుపల్లి తదితర గ్రామాల్లో అనేక చెట్లు, కరెంట్ స్తంభాలు నేలకూలాయి. ప్రధాన చౌరస్తాలో పలువురి ఇళ్లపై ఉన్న రేకులు గాలికి కొట్టుకుపోయాయి. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో చెట్టు విరిగిపడటంతో ఓ కారు ధ్వంసమైంది. నాగులమ్మ దేవాలయంపై చెట్టు కూలడంతో ఆలయం పాక్షికంగా దెబ్బతింది. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో ఉన్న వందేళ్ల నాటి పెద్ద వేపచెట్టు వేళ్లతో సహా కూలిపోయింది. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో మండల వ్యాప్తంగా సరఫరా నిలిచిపోయి ప్రజలు చీకట్లో తీవ్ర అవస్థలు పడ్డారు. పొలాల



వద్ద ఆరబోసిన వ్యవసాయ దినుసులు తడిసిపోవ దంతో రైతులు నష్టపోయారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు

అక్షర దర్బార్, శాయంపేట (మే 26): రాత్రి వేళల్లో రహదారులపై జరిగే రోడ్డు ప్రమాదాలను నివారించే చర్యల్లో భాగంగా శాయంపేట పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. పరకాల ఏసీపీ సతీష్ బాబు ఆదేశాల మేరకు, శాయంపేట సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై పరమేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పెద్దకొడేపాక గ్రామంలోని దాదాపు 50 వ్యవసాయ ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాత్రి సమయాల్లో వెనుక వచ్చే వాహనదారులకు ట్రాక్టర్లు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని, రేడియం స్టిక్కర్ల వల్ల ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. నిబంధనల ప్రకారం వాహనదారులు రేడియం స్టిక్కర్లు కలిగి ఉండాలని సూచించారు.



## నకిలీ, హెచ్ టీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

### ఎరువుల డీలర్లతో మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని సమావేశం



అక్షర దర్బార్, శాయంపేట (మే 26): శాయంపేట మండల రైతు వేదికలో ఖరీఫ్ సీజన్ సన్నాహకాలపై మండల వ్యవసాయ అధికారి మార్క ప్రియదర్శిని ఆధ్వర్యంలో విత్తనాలు, ఎరువులు మరియు పురుగుమందుల డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని మాట్లాడుతూ.. డీలర్లు నిషేధిత హెచ్.టి. పత్తి విత్తనాల విక్రయాన్ని పూర్తిగా నిలిపివేయాలని, ప్రభుత్వం అనుమతించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. డీలర్లు తమ వద్ద రిజిస్టర్లు, బిల్ బుక్స్ సక్రమంగా నిర్వహించాలని, స్టాక్ బోర్డులను నిరంతరం అప్‌డేట్ చేస్తూ స్పష్టంగా కనిపించే చోట ప్రదర్శించాలన్నారు. యూరియా విక్రయాలను పూర్తిగా ఫర్టిలైజర్ యాప్ ద్వారానే జరపాలని, గడువు ముగిసిన పురుగుమందులు అమ్మితే కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

## సుమలత హత్య మిస్టరీ వీడింది.. ప్రియుడే హంతకుడు!

○ అనుమానంతోనే గొంతు కోశాడు
○ వివరాలు వెల్లడించిన ఏసీపీ రవీందర్ రెడ్డి
○ (అక్షర దర్బార్ కథనమే నిజమైంది..)

అక్షర దర్బార్, నర్సంపేట (మే 26): లక్ష్మీపురం గ్రామానికి చెందిన తాళ్ళపల్లి సుమలత అనుమానాస్పద మృతి కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మరొకరితో చనువుగా ఉంటూ తనను దూరం పెడుతుందనే అనుమానంతోనే ప్రియుడు ఆమెను అత్యంత దారుణంగా హత్య చేసినట్లు నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 22వ తేదీనే "పోలీసుల అదుపులో నిందితుడు..?" అంటూ అక్షర దర్బార్ ప్రచురించిన కథనం అక్షరసత్యమైంది. లక్ష్మీపురం గ్రామానికి చెందిన సుమలతకు అదే గ్రామానికి చెందిన పాండవుల సురేష్‌తో గత ఐదేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. అయితే, గత కొన్ని రోజులుగా సుమలత సురేష్‌ను దూరం పెడుతుండటం, ఆమె ఫోన్ తరచూ బిజీ వస్తుండటంతో సురేష్ అనుమానం పెంచుకున్నాడు. తన ప్రాధాన్యత తగ్గిపోతుందనే ఆవేశంతో ఆమెను హతమార్చాలని ప్రణాళిక వేశాడు. ఈ నెల 20వ తేదీన వరంగల్‌కు రమ్మని పిలిచి, ముందస్తు ప్లాన్ ప్రకారం కాశీబుగ్గలో కత్తి కొనుగోలు చేశాడు. సాయంత్రం ఇద్దరూ కలిసి బైక్‌పై లక్ష్మీపురం బయలుదేరారు. రాత్రి వేళ లక్ష్మీపురం శివారు కెనాల్ కాలువ వద్దకు రాగానే ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న సురేష్, ఆమెపై దాడి చేసి కత్తితో గొంతు కోసి హత్య చేసి పరారయ్యాడు. పోలీసులు సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా, సీసీ కెమెరాల సాయంతో నిందితుడు సురేష్‌ను అదుపులోకి తీసుకోగా, అతడు నేరాన్ని అంగీకరించాడు. ఈ కేసును వేగంగా ఛేదించిన రూరల్ సీఐ సాయి రమణ, దుగ్గొండి ఎస్సై రణధీర్‌లను ఏసీపీ రవీందర్ రెడ్డి అభినందించారు.